## క్లుప్తంగా

### పింఛన్ల వెరిఫికేషన్ వాయిదా

**ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం, మార్చి 1వ తేదీన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరగనున్న సామాజిక పింఛన్దారులు ఆరోగ్య పరిస్థితిపై చేపట్టనున్న వెరిఫికేషన్ అనివార్య కారణాల వలన వాయిదా పడిందని ఎంపీడీఓ సునీతశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు తేదీల్లో వెరిఫికేషన్ నిమిత్తం ఎవరూ వెళ్లవద్దని చెప్పారు.

### చంద్రశేఖర ఆజాద్‌కు నివాళి

**గానుగపాడు(తిరువూరురూరల్):** విప్లవ వీరుడు చంద్రశేఖర ఆజాద్ వర్ధంతి కార్యక్రమం గానుగపాడు గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాంప్రదీప్, సచివాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ చేసిన వీరోచిత పోరాటాలను రాంప్రదీప్ వివరించారు.

### వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

**జగ్గయ్యపేట:** పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. లోక కల్యాణార్థం ప్రతి ఏటా శివరాత్రి పర్వదినాన స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణం పీటలపై స్వర్ణకార సంఘాల ప్రతినిధుల దంపతులు కూర్చుని కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అర్ధాకలితో చదువులు ఎలా?

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- ఉదయమే తరగతులకు హాజరవుతున్న టెన్త్ విద్యార్థులు
- అల్పాహారం అందించని కూటమి ప్రభుత్వం
- నీరసించిపోతున్న విద్యార్థులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు అందిన ఉప్మా, గుగ్గిళ్లు


మూలపాడు జెడ్పీ పాఠశాలలో స్టడీ అవర్స్‌కు హాజరై చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం:** నూరు శాతం ఫలితాల లక్ష్యంతో వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు అదనపు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. మార్చి 17న జరుగనున్న పబ్లిక్ పరీక్షలకు గత డిసెంబర్ 1 నుంచి ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. రోజు వారీ క్లాస్‌లతోపాటు ఉదయం, సాయంత్రం మరో రెండు గంటల పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. పరగడుపున క్లాస్‌లకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఉదయం 8 గంటలకే క్లాస్‌కు అటెండ్ కావాలనే ఆతృతతో కొందరు విద్యార్థులు ఏమీ తినకుండా పాఠశాలలకు చేరుతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటూ నీరసించిపోతున్నారు. మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకుని అర్ధాకలితో అలమటిస్తున్నారు. మండలంలో ఐదు జెడ్పీ పాఠశాలలు, కొండపల్లి మున్సిపాల్టీలోని రెండు ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో బాలికలు 351, బాలురు 317, మొత్తం 668 మంది అర్ధాకలితో బాధపడుతున్నారు.

### గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. నాడు–నేడు పథకం ద్వారా సుమారు 32 పాఠశాలలను సుమారు రూ.6 కోట్లతో అభివృద్ధి చేసింది. నూరుశాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించింది. పరీక్షలకు ముందు వంద రోజుల ప్రణాళికతో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించి జిల్లా పరిషత్ సంస్థ సహకారంతో అల్పాహారంగా గోధుమ ఉప్మా, శనగ గుగ్గిళ్లు అందించి వారి ఆకలి తీర్చింది.

### కూటమి ప్రభుత్వంలో..

విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు డిసెంబర్ ఒకటి నుంచి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. మూలపాడు, గుంటుపల్లి గ్రామాలతో పాటు కొండపల్లి జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలకు అధిక శాతం మంది పొరుగు గ్రామాల నుంచి వచ్చే వారే. వీరంతా ఉదయం 8 గంటలకు క్లాస్‌లకు హాజరుకావాలనే హడావుడిలో నిద్రలేచి ఇంటి వద్ద ఏమీ తినకుండా పాఠశాలకు చేరుతున్నారు. సాయంత్రం కూడా ఇళ్లకు ఆలస్యంగా చేరడంతో నీరసించి పోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకుంటున్నారు. కొండపల్లిలో ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాల, బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారం, అల్పాహారం అందిస్తూ ఉదయం, రాత్రి వేళల్లో అదనపు తరగతులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అర్ధాకలితో చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల కాలంలో అయినా అల్పాహారం అందించాలని కోరుతున్నారు.

### నివేదికలు పంపాం



జెడ్పీ పాఠశాలల్లో టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా ప్రత్యేక నిధులు కోరుతూ అధికారులకు నివేదికలు పంపాం. గతేడాది అల్పాహారానికి జిల్లా పరిషత్ ప్రత్యేక నిధులు కేటాయించింది. ఈ ఏడాది ఇంకా నిధులు మంజూరు కాలేదు. అప్పటి వరకు దాతల సహకారం తీసుకుందామని ప్రయత్నించాం. ఎవరూ ముందుకు రాకపోవడంతో కార్యరూపం దాల్చలేదు.

– సీహెచ్ పుష్పలత, విద్యాశాఖాధికారి, ఇబ్రహీంపట్నం

### ఏమీ చేయలేక పోతున్నాం

మూలపాడు జెడ్పీ పాఠశాలలో టెన్త్ విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉంది. మండలంలో ఏడు గ్రామాల నుంచి 220 మంది విద్యార్థులు వచ్చి టెన్త్‌క్లాస్ చదువుతున్నారు. ఉపాధ్యాయులు సొంతంగా అల్పాహారం అందించాలని భావించాం. సంఖ్య ఎక్కువగా ఉండటంతో సాధ్యపడలేదు. విద్యార్థులకు అల్పాహారం లేకపోవడం బాధగా ఉంది.

– డేవిడ్ రాక్‌ఫెల్లర్, హెచ్ఎం మూలపాడు జెడ్పీ పాఠశాల

### వైభవంగా శివపార్వతుల కల్యాణం



**చాట్రాయి:** మహా శివరాత్రి సందర్భంగా చాట్రాయి గ్రామంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం నిర్వహించారు.

### శ్మశానవాటికకు మరమ్మతులు పూర్తి చేయండి

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** శ్మశానవాటికలో అవసరమైన సౌకర్యాలను కల్పించాలని, మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి కండ్రిక జంక్షన్ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద హిందూ, క్రైస్తవ, ముస్లింల శ్మశానవాటికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా శ్మశానవాటికల్లో ప్రజలకు అవసరమైన మరుగుదొడ్లు, నీటి సరఫరా, షెడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. శ్మశానవాటికలు మొత్తం మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**తిరువూరు:** కృష్ణా–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం తిరువూరు నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగింది. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాలు, గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రెండు చొప్పున, విస్సన్నపేటలో మూడు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 9,377 మంది ఓటర్లుండగా 67 శాతం ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు. తిరువూరులో 69 శాతం, విస్సన్నపేటలో 65 శాతం, ఎ.కొండూరులో 72 శాతం ఓట్లు, గంపలగూడెం మండలంలో 78 శాతం ఓట్లు పోలయ్యాయి.



జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో ఓట్లు వేసేందుకు లైన్‌లో నిలబడిన గ్రాడ్యుయేట్లు


నూజివీడులో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

**73.48శాతం పోలింగ్ నమోదు**

**జి.కొండూరు:** జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో కలిపి 73.48 శాతం పోలింగ్ జరిగిందని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలో మొత్తం పురుషులు 1,062, మహిళలు 675, థర్డ్ జెండర్ 1ఓటు ఉండగా పురుషులు 799మంది, మహిళలు 478 కలిపి మొత్తం 1,277మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పా చెప్పారు.

- **జి.కొండూరు:** రెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ బూత్‌లలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 72.02 శాతం ఓటింగ్ నమోదైందని తహసీల్దార్ సుశీలాదేవి తెలిపారు. మండల పరిధిలో మొత్తం 1,576 ఓట్లు ఉండగా 1,135 ఓట్లు పోలయ్యాయని చెప్పారు.
- **మైలవరం:** మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలోని నాలుగు బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 2,605 మంది ఓటర్లు ఉండగా 1,684 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 64.64 శాతం పోలింగ్ నమోదైంది.
- **ఇబ్రహీంపట్నం:** స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఎనిమిది పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 45వ నంబర్ బూత్‌లో గుంటుపల్లికి చెందిన మహిళ జ్ఞానదీప్తి ఓటు వేసేందుకు రాగా, అప్పటికే ఆమె ఓటు వేసినట్లు అధికారులు గుర్తించారు. దొంగ ఓటు నమోదు అయినట్లు గుర్తించిన ఎన్నికల ఉప అధికారి వై.వెంకటేశ్వర్లు సూచన మేరకు ఆమె టెండర్ ఓటు వేశారు. మండలంలో మొత్తం 4,495 మంది ఓటర్లు ఉండగా 3,034 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**మంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలన**

పోలింగ్ సరళిని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పరిశీలించారు. గ్రాడ్యుయేట్లు ప్రజాస్వామ్య బద్ధంగా స్వచ్ఛంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని వారు కోరారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

- **చాట్రాయి:** చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో 9వ నంబర్ పోలింగ్ బూత్‌లో 800 ఓటర్లు ఉండగా 562 ఓట్లు పోలయ్యాయి. 10వ నంబర్ పోలింగ్ బూత్‌లో 753 ఓటర్లు ఉండగా 496 ఓట్లు పోలయ్యాయి. మంత్రి పార్థ సారథి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,650 ఓటర్లు ఉండగా 1,189 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.60 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు. సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికలను తహసీల్దార్ ప్రసాద్ పర్యవేక్షించారు. ఎస్ఐ శుభశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.
- **నూజివీడు:** నూజివీడు పట్టణంలో ఆరు పోలింగ్ స్టేషన్లలో మొత్తం 5,115 ఓట్లు ఉండగా 3,544 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 9,652 ఓట్లు ఉండగా 6,744 ఓట్లు పోలయ్యాయి. దీంతో 70 పోలింగ్ శాతం నమోదైంది. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోని పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డి, జెడ్పీ బాలికల హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బీవీ సుబ్బారావు పర్యవేక్షించారు.

**మునుసూరులో 71.9 శాతం పోలింగ్**

**మునుసూరు:** మండలంలోని 11, 12 నంబరు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,343 మంది ఓటర్లుండగా 966 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 71.9 శాతం ఓటింగ్ నమోదైందని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. కాగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి కూటమి కార్యకర్తలు యథేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి సమీపంలోనే ప్రచారం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


చంటిబిడ్డతో వచ్చి చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో ఓటు వేసిన మహిళ


ఇబ్రహీంపట్నంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే వసంత


తిరువూరు పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ మాధురి


జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడిన గ్రాడ్యుయేట్లు

### భక్తులకు అన్నదానం

**తిరువూరు:** స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని రామలింగేశ్వరాలయంలో గురువారం మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులకు లింగోద్భవ సమయంలో పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం, విశేష అర్చనలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

**మూడు వేల మందికి అన్నదానం..**

**ఆగిరిపల్లి:** స్థానిక వరాహ పుష్కరిణి వద్ద వేంచేసి ఉన్న బాలా సుందరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో గురువారం గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడువేల మందికి అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి లేకుండా చర్యలు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో పర్యటించారు. గొల్లపూడి, జక్కంపూడి పంచాయతీల పరిధిలోని వైఎస్సార్ కాలనీ మొత్తం పర్యటించి రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మరమ్మతులు ఏమైనా ఉంటే వాటిని పూర్తి చేయాలని సూచించారు. ఆహ్లాదకర వాతావరణం పెంపొందించడానికి మొక్కలు నాటాలని పేర్కొన్నారు. వీధి దీపాలు నిత్యం వెలిగేలా చూడాలని, డ్రెయినేజీ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షిస్తూ కాలనీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమ్యూనిటీ హాల్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఈఈ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.









### వెల్వడంలో సాంస్కృతిక కార్యక్రమాలను అడ్డుకున్న పోలీసులు

**మైలవరం:** మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను గురువారం పోలీసులు అడ్డుకున్నారు. వెల్వడం గ్రామంలో శివరాత్రి సంబరాలను గ్రామస్తులు ఉత్సాహంగా జరుపుకుంటారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ పండుగకు స్వగ్రామం చేరుకుంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంబరాల్లో నాటికలు, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కావాలనే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మాత్రం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఆరోపిస్తున్నారు. నృత్యాలు అభ్యంతరకరంగా ఉన్నాయని, అందువలనే కార్యక్రమాలను అడ్డుకుంటున్నామని పోలీసులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా శివరాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు పోలీసులు అభ్యంతరం చెప్పలేదని, పోలీసులు ఈ ఏడాది కావాలనే ఈ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.


వెల్వడంలో ఉత్సవాల సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు

# యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా


కోడూరు కొత్త చెరువులో మట్టిని తవ్వి ట్రాక్టర్లకు లోడు చేస్తున్న పొక్లెయిన్


కోడూరు గ్రామ శివారులో మట్టిని డంప్ చేస్తున్న ట్రాక్టరు

- పండగరోజూ ఆగని మట్టి అక్రమ రవాణా
- ఇటుక బట్టీలకు తరలిస్తున్న అక్రమార్కులు
- ట్రక్కు మట్టి వెయ్యి రూపాయలు

**జి.కొండూరు:** మట్టి అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోయింది. ప్రజలంతా మహాశివరాత్రి ఉత్సవాలలో ఉంటే అక్రమార్కులు ఇదే అదునుగా భావించి మట్టి అక్రమ రవాణాకు తెరలేపారు. అధికారులు సైతం భద్రతా చర్యల్లో ఉండడంతో తమకిక అడ్డేలేదన్నట్లు అక్రమార్కులు మట్టి రవాణాను కొనసాగించారు. జి.కొండూరు మండల పరిధి కోడూరు గ్రామంలోని కొత్త చెరువులో పొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్లతో మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇదే తంతు కొనసాగుతోంది. చెరువులో సారవంతమైన మట్టిని అవసరమైన రైతులకు వ్యవసాయ క్షేత్రాలకు తరలించాల్సి ఉండగా అక్రమార్కులు ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మట్టిని తరలిస్తే అనుమానం వస్తుందని భావించిన అక్రమార్కులు పొలం మెరకపేరుతో పగటి వేళ గ్రామ శివారులోని పొలంలోకి తరలించి రాత్రి సమయంలో అక్కడి నుంచి బట్టీలకు తరలిస్తున్నారు. ట్రాక్టరు ట్రక్కు మట్టిని బట్టీలకు వెయ్యి రూపాయలకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది.


చిన్న నందిగామ గ్రామ శివారులో డంప్‌లోని మట్టిని లోడు చేస్తున్న పొక్లెయిన్

**డంప్‌లను తరలించి..**

గత ఏడాది చెరువుల నుంచి తరలించి చిన్న నందిగామ గ్రామ శివారులో డంప్ చేసిన మట్టిని అక్రమార్కులు ఇటుక బట్టీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పొలం మెరకపేరుతో వేల ట్రక్కుల మట్టిని నిల్వ చేయడం, మట్టికి డిమాండ్ పెరిగినప్పుడు ఆ మట్టిని బట్టీలకు విక్రయించి సొమ్ము చేసుకోవడం అనేది అక్రమార్కులు వ్యాపారంగా మార్చుకున్నారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ప్రజలు, అధికారులంతా ఉత్సవాల్లో మునిగితేలుతుంటే అక్రమార్కులు మాత్రం డంప్‌ల నుంచి మట్టి అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగించారు.